ప్రజాశక్తి

గురువారం 5 సెప్టెంబరు 2024 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

అపార నష్టం

● వేలాది ఎకరాల్లో తుడిచిపెట్టుకుపోయిన ఉద్యానపంటలు

● లక్షల్లో అప్పుల పాలయ్యామని రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

'కృష్ణానది వరద ప్రవాకం తగ్గింది. ప్రకాశం బ్యారేజీకి దిగువకు వదులుతున్న వరద బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయానికి 3,07, 881 క్యూసెక్కులకు తగ్గిపోయింది. మూడు రోజుల పాటు మునిగి ఉన్న ఇళ్లు, పొలాలు వరద నుంచి బయటపడ్డాయి. బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను ఎత్తివేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరికను ఎగురవేశారు. అయితే మూడు రోజులు పాటు వరద ప్రభావానికి ముంపుకు గురైన పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. లక్షలు పెట్టుబడి పెట్టి సాగుచేస్తున్న పంటలు దెబ్బతినడం రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

కృష్ణానది వరదలకు చల్లపల్లి మండలం వెలువోలుకు చెందిన నిమ్మగడ్డ కృష్ణారావు రెండెకరాల పసుపుతోట ఆ గ్రామ శివారు చీదేపూడిలంకలోని మల్బరీ తోటలు 35 ఎకరాలు, పట్టుపురుగు షెడ్లు ముంపుకు గురయ్యాయి. వరద తగ్గిన తర్వాత చూస్తే పసుపు పంట కుళ్లిపోయింది.

వరద నుండి బయటకు వస్తున్న బాధితులు

బుడమేరు వరద తగ్గుముఖం పట్టడంతో విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలోని బాధితులు బతుకు జీవుడా అంటూ అక్కడ నుండి బయటకు వస్తున్నారు. ఏ విధమైన వసతి సౌకర్యాలు లేకపోవడంతో నాలుగు రోజుల పాటు వరదలో చిక్కుకుపోయి బిక్కుబిక్కుమంటూ గడిపిన ప్రజలు...ఎట్టకేలకు మోకాలిలోతు నీళ్లలోనే నడిచి వచ్చి తమ బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. చుట్టూ ఇంకా నీరు, బురద ఉన్నా తమ ఇళ్లు, ఇళ్లలోని సామాన్లను వదిలి పెట్టిరాలేక, ఒక వేళ బయటకు వెళ్తే ఏమౌతుందోననే భయంతో మరికొంత మంది అక్కడే ఉండిపోతున్నారు. వరద బాధితులు ఇంకా ఆహారం, మంచినీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. అధికారం యంత్రాంగం పంపిణీ చేస్తున్న ఆహారాం, మంచినీరు ఇంకా శివారు ప్రాంతాలకు వెళ్లడంలేదు. అధికారుల మధ్య సమన్వయ లోపం ఇంకా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తాజాగా సింగ్‌నగర్‌లోని కొన్ని ప్రాంతాలు, వన్‌టౌన్ సితారా, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



సింగ్‌నగర్‌లో వరద నుండి బయటకు వస్తున్న బాధితులు



సింగ్‌నగర్‌లో వరద తగ్గడంతో నిలిచిపోయిన పడవలు

హెలికాప్టర్‌తో ఆహారం సరఫరా

ఇద్దరు మహిళలకు గాయాలు

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా ఆహారం, బిస్కెట్లు పైనుండి కిందకు వదులుతున్నారు. న్యూ రాజరాజేశ్వరి పేటలో బిస్కెట్లు వదులుతున్న సందర్భంలో, ఇళ్లకు సమీపంలో హెలికాప్టర్ వేగం, గాలితో ఇళ్లపై ఉన్న రేకులు విరిగిపడి ఇ.శ్రీదేవి, లక్ష్మి అనే ఇద్దరు తోడుకోడళ్లకు గాయాలయ్యాయి. ఒకరికి కుట్లు వేశారు. గాయపడిన మహిళలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు పరామర్శించారు. గాయపడిన వారికి తగు వైద్య సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పడవల ద్వారా ఇంటింటికీ ఆహారం అందించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జిజిహెచ్ మార్చురీకి 24 మృతదేహాలు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ : గత మూడు రోజుల్లో బుడమేరు, కృష్ణా వరదల కారణంగా మరణించిన 24 మృతదేహాలు విజయవాడ ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. వీటిలో 18 మంది మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగు గుర్తు తెలియనివిగా ఉన్నాయి. కొన్ని చోట్ల వరద ఉధృతికి కొందరు కొట్టుకుపోగా, మరికొందరు ఎటువంటి సహాయం అందక, ఇతర అనారోగ్య కారణాల రీత్యా మరణించారు. ప్రభుత్వాస్పత్రికి గత మూడు రోజుల్లో బుధవారం సాయంత్రం నాటికి 24 మృతదేహాలు వచ్చాయి. మార్చురీకి వచ్చిన 24 మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి 18 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. నాలుగు మృత దేహాలను గుర్తుతెలియనివాటిగా గుర్తించామని, ఇంకా రెండింటికి పోస్టుమార్టం నిర్వహించాల్సి ఉందని తెలిపారు.

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విజయవాడ పరిసర ప్రాంతాల ప్రజల సహాయార్థం మచిలీపట్నం నుండి మైత్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది ప్రజలకు సరిపడా 50 వేల రూపాయల విలువ గల ఆహార పదార్థాలు, వస్తువులను ఫౌండేషన్ బందం తోట్లవల్లూరు మండలం లంక గ్రామాలకు వితరణ చేసారు. ఈ వాహనాలను జనసేన నాయకులు బండి రామకష్ణ జెండా ఊపి ప్రారంభించారు. మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షులు వేణు కుమార్, గౌరవ అధ్యక్షులు వరప్రసాద్, కార్యదర్శి రాధాకష్ణ, కోశాధికారి శ్రవణం శివ పాల్గొన్నారు.

రహదారి పునర్నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని దక్షిణ చిరు ఓలులంక గ్రామానికి వెళ్లే రహదారి వరదల వల్ల దెబ్బతినగా ఆ రహదారిని వెంటనే మరమ్మతులు చేపట్టి పునర్ నిర్మించాలని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ఆదేశించడంతో బుధవారం పంచాయతీరాజ్ ఏఈ వాసుదేవరావు రహదారిని పరిశీలించి పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, టిడిపి నాయకులు బండే రాఘవ పాల్గొన్నారు

ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గుడివాడ : జిల్లా పరిధిలోని బుడమేరు వరద ముంపు బారిన పడిన గ్రామాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. నందివాడ మండలంలోని అరిపిరాల, పోలసివారిపాలెం, రామాపురం, ఇలపర్రు గ్రామాలు బుడమేరు వరద ముంపు బారిన పడే అవకాశం ఉన్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం కలెక్టర్ గుడివాడలోని మున్సిపల్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రత్యేక అధికారులతో కూడిన బందాలను ఏర్పాటు చేశారు. అరిపిరాల గ్రామానికి సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి షాహిద్ బాబు, పోలాసివారిపాలెం గ్రామం మార్క్ ఫెడ్ డిఎం మురళీ కిషోర్, రామాపురం గ్రామం జిల్లా అటవీ శాఖ అధికారి కే రాజశేఖర్ రావు, ఇలపర్రు గ్రామం సర్వ శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె రాములు నాయక్ లను ప్రత్యేక అధికారులుగా కలెక్టర్ నియమించారు.

సమస్యలు తెలియజేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజ్ లో హిడన్ కెమేరాలు పెట్టారనే విషయం పై పోలీసు శాఖ అత్యంత లోతుగా దర్యాప్తు చేస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా ఈ ఘటనపై జరుగుతున్న విచారణ వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అవసరమైన సూచనలు, ఆదేశాలు ఇస్తున్నారు. జాతీయ స్థాయి సాకేంతిక నిపుణుల సహకారం తీసుకోవడంలో భాగంగా కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ద్వారా కూడా ఆధారాల సేకరణ జరుపుతున్నారు. ఈ క్రమంలో కాలేజీ పరిధిలో నమోదైన కేసు దర్యాప్తుకు సంబంధించి విద్యార్థినీవిద్యార్థులకు ఏ విధమైన సందేహాలు ఉంటే ఈనెల 5వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీలో ఉన్న కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం వారిని నేరుగా కలిసి సమస్యలను తెలియచేయవచ్చని జిల్లా ఎస్పీ గంగాధరరావు తెలిపారు.

రైల్వే ట్రాకే రోడ్డు...



ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం మంతెన గ్రామం ముంపుకు గురవ్వడంతో రహదారి సౌకర్యం లేకపోవడంతో స్థానికులు ఉప్పులూరు - మంతెన రైల్వే ట్రాక్‌ను రోడ్డుగా ఉపయోగిం చుకుంటున్నారు. ప్రమాదకరమైన ఈరైల్వే ట్రాక్‌పైనే రాకపోకలు సాగిస్తు న్నారు. రైల్వే ట్రాక్‌ను వరదనీరు ఇప్పటివరకు తాకిన సందర్భాలు లేవు.

వరద బాధితులకు ఆహారం సరఫరా

ప్రజాశక్తి-విజయవాడ: వరద బాధితుల కోసం వచ్చే ఆహారం, తదితర సరుకులు నిల్వ చేసేందుకు ఐజీఎంసీ స్టేడియాన్ని వినియోగిస్తున్నారు. ఆర్డర్ మేరకు ఇక్కడ నుంచి సరుకులను ఆయా ప్రాంతాలకు ఎప్పటికప్పుడు వాహనాల ద్వారా తరలిస్తున్నారు. కాగా, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు చిట్ట చివరి ప్రాంతంలోని చివరి వ్యక్తి వరకు ఆహారం అందించేందుకు అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. ప్రతి డివిజన్, ప్రతీ వీధిలో, చిట్ట చివరి ఇంటి వరకు ఆహారం అందేలా స్పెషల్ ఆఫీసర్ వైస్ చైర్మన్, శాప్ ఎండి పి.ఎస్ గిరీషా పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.10 లక్షల ఆహార ప్యాకెట్లు, నాలుగున్నర లక్షలకుపైగా మిల్క్ ప్యాకెట్లు, 10 లక్షల వాటర్ బాటిల్స్, 25 వేలకు పైగా బిస్కెట్లతో పాటు అరటి, బత్తాయి వంటి పండ్లు పంపిణీ చేశారు.

చెరువు కట్టకు మరమ్మతులు

ప్రజాశక్తి-గన్నవరం : బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో చెరువులు పొంగి పొర్లుతున్నాయి. చెరువుకి గండిపడకుండా పంచాయతీ సిబ్బంది ఇసుక, మట్టి కట్టలతో అడ్డుకట్ట వేయించారు. బుధవారం ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు భారీగా చేరుకో వడంతో చెరువులు పూర్తిగా నిండిపోయాయి. సర్పంచ్ అనిత, మాజీ సర్పంచ్ పిల్లా రామ రావు, ఉపసర్పంచ్ అజయ్, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సురేంద్ర మోహన్ బేనర్జి పాల్గొన్నారు.

మంచినీరు లేక ప్రజల ఇక్కట్లు

● సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి - విజయవాడ : బుడమేరు వరద ప్రాంతాల్లో బాధితులకు ఇంకా మంచినీరు అందడంలేదని రోగులకు అవసరమైన మందులు అందుబాటులో లేవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. కానీ బార్లు, బ్రాందీ షాపుల ద్వారా జోరుగా మద్యం మాత్రం సరఫరా అవుతోందని పేర్కొన్నారు. మంచినీళ్ల సరఫరా సందర్భంలో ప్రజలు పెద్ద సంఖ్యలో చేరుకొని నీటి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. పలు ప్రాంతాల్లో మంచినీటి ట్యాంకర్లు చేరుకోలేదని, వంట చేసుకోవడానికి నీరు లేదన్నారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ మంచినీటి కోసం కిలోమీటర్ల దూరం మూడు, నాలుగు అడుగుల నీటిలో పిల్లలు, మహిళలు, పురుషులు వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మరోవైపు వాంబే కాలనీ పలు ప్రాంతాల్లో బార్లు, బ్రాందీ షాపులు తెరిచి మందు సరఫరా చేస్తున్నారని విమర్శించారు.

వీడని వరద ముంపు

- నీటిలోనే నానుతున్న ఇళ్లు, పంట పొలాలు
- రైతులకు కడగండ్లు మిగిల్చిన వరద
- నేడూ పాఠశాలలకు సెలవు
- పలుచోట్ల పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం



గన్నవరం మండలం కేసరపల్లిలో నీట మునిగిన ఇళ్లు, కార్లు

ప్రజాశక్తి- గన్నవరం : కోట్ల రూపాయల పెట్టి కొనుగోలు చేసిన విల్లాలు వర్షాలకు మూడు అడుగుల లోతు నీళ్లలో మునిగినానుతున్నాయి. పాములు పిల్లలోకి వస్తున్నాయి. భయాందోళన కొనుగోలుదారులు ఉన్నారు. వారి ఆశలు అడియాశలు అయ్యాయి. నిలువు నీడ కోసం పడవలు ఎక్కి బయటకు వలస పోవాల్సి వచ్చింది. గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండల పరిధిలో ఉన్న రామవరప్పాడు , ప్రసాదంపాడు, ఎనికెపాడు ప్రాంతాల్లో విల్లాల్లో నెలకొన్న పరిస్థితి. వరదలకు వెళ్లాలో మూడు అడుగుల ఎత్తున నీరు నిలిచిపోవడంతో నివాసితులు విలవిల్లా డుతున్నారు. ఎంత ఉన్న తిండి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి వారికి వచ్చింది.

రైతులకు కడగండ్లు మిగిల్చిన వరద

ఒక పక్క బుడమేరు.. మరో పక్క చీమల వాగు, ఇంకోవైపు ఏలూరు కాలవ వరద రైతులకు కడగండ్లు మిగిల్చింది. నిజం చెప్పాలంటే ఎన్నడూ లేని విధంగా ఈసారి ముప్పేట వరద దాడి చేసింది. పలు గ్రామాలకు భారీ నష్టం వాటిల్లింది. వందలాది ఎకరాల భూములు కోతకు గురికాగా, పెద్దఎత్తున ఇసుక మేట వేసింది. గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల్లో దాదాపుగా 20 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్తున్నారు. వరి నాట్లు వేసి 20 నుంచి 45 రోజులైంది. కుండపోత వర్షంతో గతంలో ఎన్నడూ లేనంతగా బుడమేరు ఉగ్రరూపం దాల్చింది. ముస్తాబాద్, సావరగూడెం, కేసరపల్లి దిగువ భాగంలో గండ్లు పడటంతో పంట భూములపై విరుచుకుపడింది. కేసరపల్లి వద్ద ఏలూరు కాల్వకు మూడు చోట్ల గండ్లు పడ్డాయి. అప్పారావుపేట, బుద్ధవరం, అజ్జంపూడి తదితర గ్రామాల్లో రెండువేల ఎకరాల్లో వరి చేలు ముంపునకు గురయ్యాయి. పైరు పూర్తిగా దెబ్బతిన్నది. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకుడు ఎస్. సాంబశివరావు కోరారు.

గన్నవరం మండలం కేసరపల్లి శివారు ప్రాంతంలో ఉధతంగా ప్రవహిస్తున్న బుడమేరును జిల్లా కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధర్ రావు బుధవారం పరిశీలించారు. విజయవాడ నుంచి వరద వేగంగా వస్తుండడంతో కేసరపల్లి వద్ద నీరు ఉధృతంగా వెళు తుంది. ఏరుకు రెండు వైపులా ఉన్న పంట పొలాలు మునిగిపోవడాన్ని ఆయన గమనించారు. అదేవిధంగా కేసరపల్లి గ్రామంలో జగనన్న కాలనీ ముంపుకు గురైం దని తహసీల్దార్ శివయ్య తెలిపారు. జక్కుల నెక్కలం గ్రామానికి దారి సదుపాయం లేకుండా పోయిందని, పునరావాస కేంద్రంలో వారికి భోజనం కల్పించామని తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

జిల్లా కలెక్టర్ డీకే. బాలాజీ, జిల్లా ఎస్పి ఆర్ గంగాధరరావులు బుధవారం పెదపారుపూడి, నంది వాడ, మోపర్రు, పుట్టగుంటలలో బుడమేరు వరద ఉధృతిని పరిశీలించారు. జిల్లాలో అధిక వర్షాలు వరదల కారణంగా బుడమేరు ముంపుకు గురైన ప్రాంతాలైన మోపర్రు, పుట్టగుంట, బుడమేరు కాలువను పరిశీలిం చారు. గ్రామాలలోని వీధుల్లో తిరుగుతూ వరద ముంపు పరిస్థితులను పరిశీలించి గ్రామంలోని ప్రజలతో మాట్లాడారు. ఈ క్రమంలో వారు ట్రాక్టర్, ద్విచక్ర వాహనంపై చేరుకొని పుట్టగుంట, మోపర్రు గ్రామాల వద్ద బుడమేరు వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) :** విజయవాడ వరద బాధితులకు కృష్ణాజిల్లా అధికార యంత్రాంగం అండగా నిలిచింది. విజయవాడలో వరదల కారణంగా కొన్ని రోజుల నుంచి తాగునీరు, ఆహారం కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న క్రమంలో వారికి అవసరమైన తాగునీరు, పాలు, బిస్కెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు జిల్లా యంత్రాంగం సిద్ధం చేసి పంపించింది. మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దీనిపై ఎంపీడీవోలతో ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో అందుబాటులో ఉన్న వాటర్ బాటిళ్లు, పాలు, బిస్కెట్లు, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు సేకరించి విజయవాడ పంపాలని సూచించారు. వాటికి అయిన ఖర్చును చెల్లించి మంగళవారం రాత్రి 8 వాహనాలు, బుధవారం ఉదయం నాలుగు వాహనాలు కలిపి మొత్తం 12 వాహ నాల్లో కృష్ణాజిల్లా నుంచి విజయవాడకు పంపించారు.

నేడు జిల్లాలో పాఠశాలలకు సెలవు

కలెక్టర్ ఆదేశాల మేరకు కృష్ణా జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు 5వ తేదీ గురువారం కూడా సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖాధి కారిణిహెరా సుల్తానా తెలిపారు. కృష్ణా జిల్లాలోని అనేక పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు నిర్వహిస్తుండడంతో, మరి కొన్ని పాఠశాలల్లో నీరు నిలిచి ఉండడం, రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల గురువారం కూడా జిల్లాలోని పాఠశాలలకు పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ పంపిణీ రెండో రోజు బుధవారం కూడా కొనసాగించారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఆదేశానుసారం ఈ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ మధుసూదన్ రావు తెలిపారు. **ప్రజాశక్తి-పెదన :** వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పట్టణ శివారులోని తోటమూల, సింగరాయ పాలెం, బల్లిపర్రు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో ముచ్చటించారు. రైతులు వరుదు దుర్గారావు, వరుదు కరుణాకరన్, మారిబోయిన శ్రీనివాసరావు, గరికముక్కు శ్రీనివాసరావు, ముదినేని చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. మండలంలో పంటలు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. **ప్రజాశక్తి - గుడివాడ :** నందివాడ మండలంలో బుడమేరు ఉగ్రరూపం దాల్చి రికార్డు స్థాయిలో నీటి ప్రవాహం పెరిగిపోతుంది. చేపల చెరువు లకు గండ్లుపడి వేలాది ఎకరాల వరి పంట నీట మునిగింది. మారుమూల ప్రాంతాలకు సైతం బోట్లలో వెళ తూఎమ్మెల్యే వెనిగండ్ల రాము అనుచరులు ఆహారం పంపిణీ చేస్తున్నారు. స్థానిక నాగవరప్పాడు వంతెన వద్ద బుడమేరు ఉధతంగా ప్రవహించడంతో బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నాగవరప్పాడు వద్ద ట్రాఫిక్ కి ఎటువంటి అంతరాయం కలగకుండా నాగవరప్పాడు వంతెన దగ్గర బార్కెట్ ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక 30వ వార్డులోని రజక చెరువు ప్రాంతం పూర్తిగా మునిగిపోవడంతో టిడిపి నాయకుడు, వికలాంగుండు విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర అధికార ప్రతినిధి మజ్జాడ నాగరాజు బుధవారం స్థానికి టిడిపి నాయకులతో కలసి మునకకు గురయిన గృహాలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి :** ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ బుధవారం అన్నారు. మండలంలోని మోపర్రు, తమ్మలంపాడు, దోస పాడు, నాగాపురం, ఇంజిరంపాడు తదితర గ్రామాలలో వరద ముంపు కు గురైన పొలాలను,గ్రామంలోని గహాలను సందర్శించి పరిశీలించారు. ఎంపీపీ గోగం సురేష్, వైసిపి నాయకులు గోళ్ల సోమేశ్వరరావు, జూపల్లి వెంకటరావు, శివయ్యే పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఘంటసాల :** గుంటూరులోని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డా.పి.వి.సత్యనారాయణ అధిక వర్షాలు ప్రభావిత మండలాల పర్యటనలో భాగంగా ఘంటసాలలోని పంట పొలాలను శాస్త్రవేత్తలు, అధికా రులతో కలసి పర్యటించారు. ఏఆర్ఎస్ మచిలీపట్నం ప్రధాన శాస్త్రవేత్త డాకె.నాగేంద్రరావు, ఘంటసాల కెవికె ప్రోగ్రామ్ కో - ఆర్డినేటల్ డా పి శ్రీలత, ఘంటసాల ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డా.సత్యప్రియలలిత పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** వరదలలో సర్వం కోల్పోయి నిరాశ్ర యులైన వరద బాధితులకు ఉయ్యూరు పట్టణానికి చెందిన ఉష డిజైనర్స్ అధినేతలు ఆలపాటి ఉషారాణి, కంభంపాటి ఝాన్సీ రాణిలు రూ 2 లక్షల 30వేలు వెచ్చించి సహాయ సహకారాలు అందించారు. తాసిల్దార్ కుసుమకుమారి, పమిడి ముక్కల సీఐ చిట్టిబాబు, ఎంపీడీవో స్వర్ణలత చేతుల మీదుగా వీరు వరద బాధితుల కోసం ఏర్పాటుచేసిన చీరలను బుధవారం అందించారు. అలాగే మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం నాయకులు బుధవారం పర్యటిం చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదల వెంకటేశ్వరరావు, కోసూరు శివ నాగేంద్రం, సిపిఎం నాయకులు బండపల్లి రాజేష్, గోపాల్, సింహాద్రి రాంబాబు, ఏమినేని లెనిన్ తదిత రులతో కూడిన బందం వరద ప్రభావం వల్ల మునిగిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వివరాల అడిగి తెలుసుకున్నారు. అనంతరం వల్లూరు పాలెం, తోట్లవల్లూరు, బద్రిరాజు పాలెం, దేవరపల్లి గ్రామాలలో పునరావాస కేంద్రాల్లోని వరద బాధితులతో మాట్లాడారు.

మండలంలో వరద తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి వస్తున్న వరద నీరు కృష్ణానది పాయలోనే ప్రవహిస్తుంది. దీంతో మునిగిన పంటలు బయటపడుతున్నాయి. **ప్రజాశక్తి-చల్లపల్లి.** మండల పరిధిలోని కొత్త మాజేరు లక్ష్మీపురం గ తదితర గ్రామాల్లో అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షంలో ఇంకా నానుతున్న పొలాలను, ఇళ్లల్లోకి నీరు ప్రవహించిన గహాలను, వరద బాధిత పునరావాస కేంద్రాలను సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. సిపిఎం మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, వేముల నాగేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం తరపున మోపిదేవి మండలం లోని ఐదువేల మందికి పైగా వరద బాధితులకు భోజన సదుపాయం కల్పించారు. అలాగే ఒంగోలుకు చెందిన పీస్ గాస్పెల్ మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ బుర్రె శాంసన్ సహకారంతో వరద బాధితులకు భోజనాలు సమకూర్చారు.అలాగే మండలంలోని కొక్కిలగడ్డ కొత్తపాలెం వరద బాధితులకు ఇఫ్కో ఎరువుల కంపెనీ బుధవారం దుప్పట్లు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు. అలాగే మండలం లోని కె కొత్త పాలెం వద్ద కరకట్ట రహదారిపై ఉన్న వరద బాధితులకు వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు విస్సంసెట్టి దుర్గ కొల్లిపర మౌనిక రేవతి నాగమణి తదితర సభ్యులు బుధవారం ఆహార ఉత్పత్తుల అందించారు. **ప్రజాశక్తి-పమిడిముక్కల:** పెనుముచ్చు గ్రామానికి చెందిన బేబీ సరోజిని వరద బాధితులను ఆదుకోవడం అభినంద నీయమని పమిడిముక్కల ఎస్సై శీను అన్నారు. బుధవారం మండలంలోని లంకపల్లి ప్రాథమిక్ పాఠశాలలో వరద బాధితులకు రగ్గులు, ఇతర సామాగ్రి అందించారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ :** మచిలీపట్నం మండలంలో గత రెండు రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాల వల్ల ముంపుబారిన పడిన వరి పొలాలను ఆచార్య ఎన్.జి.రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా .పి వి సత్యనారాయణ,మచిలీపట్నం ఏ ఆర్ ఎస్ ప్రిన్సిపల్ డైరెక్టర్ డా.కే నాగేంద్ర రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు వరి పైరు మూడు కన్నా ఎక్కువ రోజులు నీట మునిగితే వీలైనంత త్వరగా నీరు బయటకి తీసివేయాలన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడ వరద బాధితుల సహాయార్థం బంటుమిల్లి మండలంలో సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ యాజమాన్యం మంచినీళ్లు బాటిల్ బిస్కెట్ ప్యాకెట్స్ డ్రింక్ బాటిల్స్ మజ్జిగ ప్యాకెట్స్ బస్సుల్లో విజయవాడ పంపించినట్లు సెయింట్ జాన్ స్కూల్ డైరెక్టర్ సాబుజాన్ ఝాన్సీ సబ్ తెలిపారు..

రాజేశ్వరమ్మకు నివాళి



ప్రజాశక్తి-ఉయ్యూరు : మహిళా హక్కుల కోసం, తొలి తరం మహిళా ఉద్యమ నేతగా సారా వ్యతిరేక పోరాటంలో మహిళా సంఘంలో కీలక పాత్ర నాగళ్ళ రాజేశ్వరమ్మ పోషిం చారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే శివ నాగేంద్రం అన్నారు. బుధవారం రాజేశ్వరమ్మ ఎనిమిదవ వర్ధంతి పురస్కరించుకొని ఉయ్యూరు లోని విజ్ఞాన కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజేశ్వరమ్మ సమకాలికుడు సహోదరుడు అయినా అట్లూరు రామచంద్రరావు ఆమె జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి రాజేష్, సభ్యులునిమ్మిది గోపాల్ పడాల లక్ష్మణరావు టూ మాట లక్ష్మణరావు అన్నే సుబ్బారావు బుల్లియ పాల్గొన్నారు.

బీహెచ్ఈఎల్‌కు బస్ సర్వీసులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుండి నూతనంగా వచ్చిన కొత్త నాన్ ఏసి స్లీపర్ స్టార్ లైనర్ రెండు బస్సులను గురువారం నుండి హైదరాబాద్ బిహెచ్ఈఎల్కు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె హనుమంతరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ బస్సుల్లో 30 బెర్తులు ఉంటాయని, అప్పర్ బెర్త్ కు చార్జీ రూ 890, లోయర్ బర్త్ చార్జీ 970 గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సర్వీసు అవనిగడ్డలో రాత్రి 9:30 గంటలకు బయలుదేరి ఉదయం 6:10 గంటలకు బిహెచ్ఇఎల్ కు చేరుతుందన్నారు. అలాగే బీహెచ్ఈఎల్ నుండి రాత్రి 9 గంట లకు బయలుదేరి ఉదయం 5:45కు చేరుతుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గన్నవరం : విద్యుత్ షాక్‌తో గేదె, దాని యజమాని మృతి చెందిన సంఘటన బుధవారం తెంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సేకరిం చిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన నాగనబోయిన శివాజీ (50) ఇంటి వద్ద తెగిపడి ఉన్న కరెంటు వైర్ పై గేదె కాలు వేయడంతో షాక్ తగిలి చనిపోయింది. గేద పడి ఉండటాన్ని గమనించిన శివాజీ కంగారు పడి దానిని పట్టుకోవడంతో షాక్ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతన్ని వైద్యం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అతను చనిపోయినట్లుగా చెప్పారు. మతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆత్కూర్ ఎస్సై సురేష్ కేసు నమోదు చేశారు.

గెయిల్‌లో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మహారత్న పబ్లిక్ సెక్టార్ ఎంటర్ప్రైజ్ కింద, తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి లో నడపబడుతున్న గెయిల్ (ఇండియా) లిమిటెడ్ కంపెనీలో పి డబ్ల్యూ బి డి, అభ్యర్థుల కోసం కింద 391,పోస్ట్(లు)లలో గల ఖాళీలకు సంబంధించి అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్ బాబు తెలియజేసారు. సంబంధిత విభాగం(ల) లోని ఖాళీలకు మరియు విద్యార్హతలకు, రిజర్వేషన్స్ మరిన్ని వివరాల కొరకు https://gailonline.com/CRApplyingGail.html లింక్‌లో తెలుసుకోవాలన్నారు. అర్హులైన అభ్యర్థులు, ముందుగా https://employment.ap.gov.inలో నమోదు చేసుకో వాలని ఈ నెల 7 సాయంత్రం 6 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పశుగ్రాసం పంపిణీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామాన్ని వరద నీరు చుట్టుముట్టడంతో గ్రామంలోని ప్రజలతోపాటు మూగజీవాల సైతం ఆకలితో అలమటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ దష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి పశువుల కోసం రెండు ట్రాక్టర్ల వరిగడ్డి ఇతర జీవాల కోసం దాన అందజేశారు. ఈ సందర్భంగా పశువుల కోసం గ్రామాలలో ఉన్న వారికి బిస్కెట్లు రొట్టెలు అన్నం ప్యాకెట్లు అందజేశారు.


విజయవాడలో వరద బాధితులకు ఆహారం తీసుకెళ్తున్న దృశ్యం


సింగ్‌నగర్‌లో కాస్తా తగ్గుముఖం పట్టిన వరద


తోట్లవల్లూరు మండలంలో వరద నీటిలోనే పంటలు


తోట్లవల్లూరు మండలంలో వరద బాధితులను పరామర్శిస్తున్న నాయకులు


పెడన మండలంలో పంటపొలాలు పరిశీలిస్తున్న నాయకులు


మోపిదేవిలో వరద బాధితుల కోసం ఆహారం సిద్ధ చేస్తున్న దృశ్యం


పెదపారుపూడి మండలంలో పర్యటిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ప్రజాశక్తి
www.prajasakti.com
కృష్ణాజిల్లా
గురువారం
5 సెప్టెంబర్ 2024

వరద ముంపులోనే...


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వచ్చిన డాక్టర్లు


విజయవాడలో జెసిబి సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తూ...


వరదలకు పాడైపోయిన ద్విచక్రవాహనాలు


మూగ జీవాల దుస్థితి...



సింగ్‌నగర్‌లో వరద బాధితులు


ప్రకాశం బ్యారేజీని పరిశీలిస్తున్న వైఎస్ షర్మిలా








నందివాడ మండలంలో ఉప్పొంగిన బుడమేరు వాగు


విజయవాడ రూరల్ మండలంలో నీట మునిగిన పంట పొలాలు


సింగ్‌నగర్‌లో తగ్గని వరద


విజయవాడలో వరద బాధితులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


వరద నుంచి కాపాడుకునేందుకు రిక్షాపై ద్విచక్రవాహనాన్ని తీసుకొస్తున్న దృశ్యం


విజయవాడ సింగ్‌నగర్‌లో వరద ముంపులోనే భోజనం చేస్తున్న కుటుంబం


విజయవాడ సింగ్‌నగర్‌లో సురక్షిత ప్రాంతానికి వెళ్తున్న కుటుంబం


బందరులో పాడైన పంటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



వరద బాధితులకు ఆహారం పంపిస్తున్న బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ హైస్కూల్


విజయవాడలో నీట మునిగిన ఇళ్లు


అవనిగడ్డలోని పులిగడ్డ అక్విడెట్ వద్ద ప్రవహిస్తున్న వరద నీరు


నందివాడ మండలంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు


చల్లపల్లి మండలంలో నీట మునిగిన పంటను చూపిస్తున్న దృశ్యం


బందరు కలెక్టరేట్‌లో విజయవాడకు ఆహారం పంపిస్తున్న దృశ్యం


గన్నవరం మండలంలో నీటిలోనే పంటలు


కంకిపాడు మండలంలో వరద నీటిలోనే పంటలు


అవనిగడ్డలో వరద బాధితులతో మాట్లాడుతున్న మండలి వెంకటరామ్

మల్లమ్మ చెరువుకు ప్రమాదం

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరులో అక్కపాలెం వెళ్లే రోడ్డుకు పక్కనున్న మల్లమ్మ చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. భారీ వర్షాలకు చెరువులోకి వరద ఉధృతంగా చేరడంతో కట్టకు భారీ గండిపడింది. సరిహద్దు తెలంగాణ ప్రాంతం నుండి వచ్చే వరద ఇంకా రావడంతో చెరువు పొంగితే కట్ట పూర్తిగా తెగిపోయే ప్రమాదం ఉందని ఆయకట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వరదలతో పొలాల్లో వేసిన ఇసుక మేటకు వరి పంట కనిపించటంలేదని, ఈ కట్ట కుడా తెగిపోతే తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని రైతులు భయాందోళన చెందుతున్నారు. మరోపక్క అక్కపాలెం రోడ్డు కూడా వరదలకు పూర్తిగా ధ్వంసం అయిందని, రోడ్డు వరద కూడా పంట పొలాల్లోకి వస్తుందని, అధికారులు స్పందించి చెరువు కట్ట తెగకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



500 కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి-వత్సవాయి: వరద బాధితుల కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారిని ఆదుకోవడం చాలా గొప్ప విషయం అని వత్సవాయి ఎస్సై ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ రవిబాబు అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో ఎన్టీఆర్ జిల్లా తొలి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు వెంకట రాజారావు ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 4 లక్షలు విలువ గల 500 కుటుంబాలకు సరిపడా 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్లు, దుప్పట్లు, పాల ప్యాకెట్లు, బిస్కెట్లు, క్యాండిల్స్, స్నాక్స్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వత్సవాయి సబ్ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, డిటి రవిబాబు చేతుల మీదుగా జెండా ఊపి వాసవి కళ్యాణ మండపం ప్రాంగణం నుంచి లారీని విజయవాడ పంపించారు.



వరద బాధితులకు అండగా దాతలు

ప్రజాశక్తి-కంచికచర్ల: మండలంలోని కొత్తపేట, గని ఆత్కూరు, చెవిటికల్లు, కునికినపాడు, మున్నలూరు, మోగులూరు, యస్ అమరవరం, వేములపల్లి, పెండ్యాల గ్రామాలు నీట మునిగి సుమారు ఎనిమిది వేల మంది నిరాశ్రులయ్యారు. బాధితులకు కంచికచర్ల ఓసీ క్లబ్ లో, పరిటాల, గని ఆత్కూరు హైస్కూల్‌లో పునరావాసం కల్పించారు. ఈ నెల 2వ తేదీ నుండి ఓసి క్లబ్ సభ్యులు, మండల టిడిపి ఆద్యక్షుడు కోగంటి బాబు ఆధ్వర్యంలో దాతల సహాయంతో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, సాయంత్రం భోజన వసతి ఏర్పటు చేస్తున్నారు. ఓసి క్లబ్లో పునరావాస కేంద్రంలో వెయ్యి మందికి వసతి కొనసాగుతుంది. పునరావాస బాధితులకు కంచికచర్లకు చెందిన ప్రముఖ ట్రాన్స్ పోర్టు నిర్వాహకులు నంబూరు వెంకయ్య, ఆయన కూమారులు పెదబాబు, గోల్డుబాబు, వీర నాగేశ్వరరావు ఆరు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. మంగళవారం రాత్రి ఉపాధ్యాయ సంఘం నేతలు భోజన వసతి ఏర్పాటు చేశారు.

రేగళ్లకు దక్కనున్న ఎంఎంసి ఛైర్మన్ పదవి?

ప్రజాశక్తి-గంపలగూడెం: తిరువూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యే పదవి తర్వాత అగ్రికల్చరల్ మార్కెటింగ్ (ఎఎంసి) కమిటీ ఛైర్మన్ పదవికి గతంలో అనేక మంది నాయకులు పోటీలు పడి తీవ్రస్థాయిలో లాబీయింగ్ చేసేవారు. ప్రస్తుతం తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సారధ్యంలో మాత్రం దానికి విరుద్ధంగా కనిపిస్తోంది. నామినేటెడ్ పదవులు ఎలా ఎవరికి ఇవ్వాలన్న విషయంపై ప్రత్యేక కసరత్తు చేసి ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. దీనిలో భాగంగా గంపలగూడెం మండల టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ రైతు రేగళ్ల వీరారెడ్డికి ఎఎంసి పదవిని కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆశీస్సులు ఉన్నట్లు సమాచారం. ప్రధానంగా తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు బుధవారం వీరారెడ్డిని తన కార్యాలయానికి పిలిపించి మాట్లాడంతో ఈ చర్చ తెరమీదకు వచ్చింది.



నేత్రదానంపై అపోహలు వీడండి : బోడే

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: కార్నియల్ వ్యాధులు ప్రధాన కారణంగా అంధత్వం, దృష్టి లోపం సంభవిస్తున్నాయని శాసన సభ్యులు బోడే ప్రసాద్ తెలిపారు. జాతీయ నేత్రదానం పక్షం సందర్భంగా బుధవారం నగరంలోని కోడి వెంకటాద్రి చౌదరి ప్రాంగణంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో నేత్రదానంపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ తరహా సదస్సులు ఎంతో ఉపయోగకరమన్నారు. ఎల్వీపీఈఐ కార్నియా, యాంటీరియర్ సెగ్మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్ అరవింద్ రాయ్ మాట్లాడుతూ మానవ కార్నియా అనేది కనుపాప, కంటిపాప పూర్వ గదిని కప్పి ఉంచే కంటి యొక్క పారదర్శక ముందు భాగం అని, కంటికి సంబంధించిన ఇన్ఫెక్షన్‌లు, కంటికి గాయం, విటమిన్ ఎ లోపం, కంటికి సంబంధించిన పుట్టుకతో వచ్చే వ్యాధుల వంటి పోషకాహార లోపం కారణంగా కార్నియా మబ్బుగా మారడంతో కంటికి స్పష్టంగా చూడగలిగే సామర్థ్యం తగ్గిపోతుందన్నారు. ఈ తరహా వ్యాధులకి ఆరోగ్యకరమైన దాత కార్నియా దానానికి ముందుకు వస్తే కార్నియా భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు నేత్రదానంపై అపోహలు వీడి దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.



ఇప్పుడు గుర్తొచ్చారా...

మాజీ ఎంఎల్‌ఎతో టిడిపి కార్యకర్తల వాగ్వాదం

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల ఓసి క్లబ్ పునరావాస కేంద్రంలో ఉన్న వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్రావుకు పలువురు టిడిపి కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నాలుగు రోజుల తర్వాత వచ్చి ప్రభుత్వాన్ని, అధికారులను తప్పుపడతారా... గో బ్యాక్ జగన్మోహన్రావు అంటూ నినాదాలు చేస్తూ కేకలు వేశారు. దీంతో పక్కనే ఉన్న నందిగామ ఆర్డీవో రవీంద్ర టిడిపి నాయకులు, కార్యకర్తలను అదుపు చేయగా మాజీ ఎమ్మెల్యేతో వచ్చిన వైసిపి నాయకులు ఆయన్ని బయటకు తీసుకువచ్చి కారు ఎక్కించారు. బుధవారం జగన్‌మోహనరావు ఓసి క్లబో పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. బాధితులకు అందుతున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో అక్కడే ఉన్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావును కలిసి పరిస్థితులను ఆరా తీశారు. పునరావాస కేంద్రం ప్రైవేట్ యాజమాన్యం సహకారంతో నడుస్తుందా.. లేక ప్రభుత్వ నిధులతో నడుస్తుందా అని ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న టిడిపి కార్యకర్తలు, బాధితులు గత నాలుగు రోజులుగా వరదల వల్ల బాధపడుతున్న తమ గురించి పట్టించుకోకుండా ఇప్పుడు వచ్చి పరామర్శిస్తారా అంటూ, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎవరేం మాట్లాడుతున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. కంచికచర్ల జడ్పీటిసి వేల్పుల ప్రశాంతితో పాటు, వైసిపి నాయకుడు వేల్పుల రమేష్, టిడిపి ఎంపీటీసీ వెంపురాల వెంకటేశ్వరరావు లు గందరగోళాన్ని సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించారు. కొద్దిసేపటికి డాక్టర్ జగన్మోహన్రావు అక్కడి నుంచి వెళ్లడంతో గొడవ సద్దుమణిగింది.



ఇంకా నీటిలోనే ఇళ్లు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

రామలింగేశ్వరనగర్, రాణిగారితోట, యనమలకుదురు తదితర ప్రాంతాలలో ఇళ్లన్నీ ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో బుధవారం కూడా పునరావాస కేంద్రాలన్నీ కిటకిటలాడాయి. పునరావాస కేంద్రాల్లో ఆహారం ఇస్తున్నారని, పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రామలింగేశ్వరనగర్, రాణిగారితోట పరిసర ప్రాంతాల్లోని బాధితులకు పటమటలంకలోని మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాలలో సుమారు 550 మంది దాగా ఉంటున్నారు. మరుగుదొడ్ల అపరిశుభ్రత, పారిశుధ్య సమస్య ఉందని బాధితులు అంటున్నారు. పునరావాస కేంద్రాల్లోని బాధితులు దగ్గు, జలుబు, జ్వరంతో పాటు కొద్దిమందికి విరేచనాలు కూడా అవుతున్నాయని తెలిపారు.



జాతీయ విపత్తుగా ప్రకటించాలి : రామకృష్ణ

ప్రజాశక్తి-నందిగామ: వరద విపత్తును జాతీయ విపత్తుగా ప్రకటించాలని, వరద సహాయక చర్యల్లో అన్ని రాజకీయ పార్టీలను ముఖ్యమంత్రి భాగస్వామ్యం చేయాలని వరద బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.20 వేలు అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారుల సమన్వయ లోపం వల్లే వరద ఉధృతికి కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, సిపిఐ సీనియర్ నాయకులు బెల్లంకొండ బ్రహ్మం, సిపిఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కొండపల్లి బొమ్మలకు విక్రయశాల : సునీత

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి ఖిలాపై కొండపల్లి కొయ్య బొమ్మల వస్తు విక్రయశాల ఏర్పాటు ను పరిశీలిస్తామని ఆంధ్రప్రదేశ్ (హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్టైల్స్) ప్రిన్సిపల్ సెక్రటరీ కె.సునీత తెలిపారు. కొండపల్లి హస్త కళాకారులను కలిసి ముంపుకు గురైన ప్రాంతాలను, గహాలను మరియు కళాఖండాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో 1987 ఎన్.టి.రామారావు కొండపల్లి కళాకారుల కొరకు నిర్మించిన 36 గృహాలను (బొమ్మల కాలనీ) పరిశీలించారు. నేడు కళాకారుల సంఖ్య పెరిగినందువలన వారికి కూడా నూతన గహనిర్మాణానికి పరిశీలిస్తామన్నారు. కళాకారులతో కొండపల్లి సొసైటీ బిల్డింగ్‌లో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీధరాచారి, మార్కెటింగ్ మేనేజర్, ఆంధ్ర ప్రదేశ్ లేపాక్షి మేనేజర్ సురేష్, యుగంధర్ పాల్గొన్నారు.



అంధకారంలో నందిగామ ప్రభుత్వాస్పత్రి

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ ప్రభుత్వాస్పత్రిలో గత మూడు రోజుల నుండి కరెంటు లేక రోగులు అవస్థలు పడుతున్నా పాలకులు, అధికారులకు పట్టడంలేదని సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి నందిగామ ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సిపిఎం నాయకులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ విద్యుత్ లేకపోవడంతో సెల్ ఫోన్ లైట్ వేసుకొని ఇంజక్షన్ చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా నందిగామ ప్రభుత్వాసుపత్రిలో విద్యుత్ సౌకర్యం కల్పించి రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, గోపినాయక్, హుస్సేన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు, నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ ఆర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో సిఎం చంద్రబాబు సహాయక చర్యలు అందిస్తున్నారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ సహాయానికి తోడు దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం చేస్తున్నారని అన్నారు. వరద బాధితులకు సహాయం చేసేందుకు డాక్టర్ చింత రంగధామారావు చారిటబుల్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. డాక్టర్ చింత రంగధామారావు చారిటబుల్ ట్రస్ట్, సెల్ హెల్త్ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ చింతా రవికుమార్ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గం పరిధిలోని 20వ డివిజన్ కృష్ణలంకలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఐఏఎస్ అధికారిని మాధవిలతా వరద బాధితులకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ ప్రతినిధి కొల్లి అజయ్ రమాకాంత్ మాట్లాడుతూ డాక్టర్ చింతా రంగ రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే జగ్గయ్యపేటలోని వరద బాధితులకు 200 దుప్పట్లు, 200 చీరలు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి గాంధీ, ట్రస్టు ప్రతినిధులు వేమూరి కాళీ కృష్ణ, గొంది ప్రదీప్, పాలడుగు పటేల్, చదలవాడ వెంకటరత్నం పాల్గొన్నారు.



బుడమేరు గండ్లను పరిశీలించిన మంత్రులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, నిమ్మల రామానాయుడు, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు పడిన గండ్లను బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల బీడీసీకి భారీ గండ్లు పడ్డాయి. దీని కారణంగా వరదనీరు పోటెత్తగా బెజవాడతో పాటు, బుడమేరు పరీవాహక ప్రాంతాలు, గ్రామాలు, పొలాలు జల దిగ్బంధమయ్యాయి. బుడమేరుకు పడిన భారీ గండ్లను కొండపల్లి శాంతినగర్-కవులూరు మార్గంలో వద్ద మంత్రులు పరిశీలించారు. వరద తీవ్రత తగ్గిన వెంటనే ఇక్కడ గండ్లను పూడ్చే పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. బుడమేరు కుడి, ఎడమ ప్రాంతాల్లో పడిన గండ్లను పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నారా లోకేష్ అధికారులతో సమీక్ష నిర్వహించి, అనంతరం బుడమేరు గండ్లు పరిశీలనకు వెళ్లారు. ఎన్ని



కోట్లు ఖర్చు అయినా గండ్లను త్వరగా పూడ్చాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు తాజా పరిస్థితిని వివరించాలని ఆదేశించారు.



బాధితులకు పులిహోర పంపిణీ

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ దేవినగర్‌లోని వరద బాధితులకు రైల్వే ఉద్యోగులు 500 పులిహోర ప్యాకెట్లను బుధవారం పంపిణీ చేశారు. రైల్వే గార్డు వి.చంద్రయ్య చొరవతో రైల్వే ఉద్యోగస్తులు విరాళాలతో దేవినగర్‌లోని పేదలకు పులిహోర పంపిణీ చేశారు. ఈ విధంగా పంపిణీ చేయడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులను అభినందించారు. వరద బాధితులను ఆదుకోవడం అభినందనీయమని పలువురు వారి సేవలను కొనియాడారు.

త్వరగా గండి పూడ్చాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కంచికచర్ల: చెరువులకు, కాల్వలకు పడిన గండ్లు త్వరితగతిన పూడ్చి పటిష్ఠంగా ఉంచాలని నందిగామ ఆర్డీఓ పి.రవీంద్రరావు అధికారులను ఆదేశించారు. వరద తగ్గడంతో బుధవారం నందిగామ ఆర్డీఓ పి రవీంద్ర , ఇరిగేషన్ అధికారులథో కలిసి పరిటాలలో చెరువుకై పడిన గండిని పరిశీలించారు. ఈ నెల 5, 6, తేదీల్లో మరో అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మళ్లీ ఏనుగుగడ్డ వాగు ఉరవడికి పరిటాల చెరువు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. రానున్న ఇబ్బందుల దృష్ట్యా చెరువుకు పడిన గండిని యుద్ధప్రాతిపదికన పూడ్చాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జాహ్నవి, టిడిపి నాయకులు కోగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు అండగా ఉంటాం : డిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి ఆహారం, మంచినీరు, సాధారణ వ్యాధుల నివారణ కోసం అవసరమైన మందులను సైతం ప్రతి ఒక్క బాధితునికి అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం శ్రమిస్తూ ఉందని వ్యవసాయ శాఖ కమిషనర్ ఎస్.డిల్లీరావు కృష్ణలంక రాణిగారితోట వరద బాధితులకు ధైర్యం చెప్పారు. రాణిగారితోటలోని పలు ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ప్రతి ఇంటిని సందర్శించారు. వరదల వల్ల నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సహాయం అందుతుందో లేదో అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ సహకారంతో ఆయుష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఇప్పటివరకు సహాయం పొందలేని వరద బాధితులు ఆందోళన చెందవద్దన్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ



సేవలు ప్రతి ఒక్కరికి అందించేందుకు అధికారులు శాఖల మధ్య సమన్వయం చేసుకోవాలని సూచించారు. వరద ఉధృతి తగ్గగానే ప్రతి వీధిని పరిశుభ్రం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేసిందని వివరించారు. అంటు రోగాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నగర పాలక సంస్థ వైద్యాధికారులకు సూచించారు.



ప్రతి రైతును ఆదుకునేలా ప్రతిపాదనలు

రాష్ట్ర ఉద్యాన సంచాలకులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: అధిక వర్షాలు, వరదలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను బుధవారం రాష్ట్ర ఉద్యాన సంచాలకులు. డా. కె.శ్రీనివాసులు సందర్శించి బాధిత రైతులకు ధైర్యం చెప్పి పంట నష్టం అంచనాలు వేయటం జరుగుతోందని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలకు దెబ్బతిన్న ఇబ్రహింపట్నం మండలం కోటికలపూడి, కేతనకొండ, మూలపాడు గ్రామాల్లో పలు ఉద్యాన పంటలను పరిశీలించారు. ముఖ్యంగా గ్రామాలలో దెబ్బతిన్న కాలిఫ్లవర్, మిరప, ఆకుకూరలు, కరివేపాకు ,ఇతర కూరగాయ తోటలను,మూలపాడు గ్రామంలోని మామిడి మరియు పామ్ ఆయిల్ తోటలను పరిశీలించి పంట నష్టాన్ని పరిశీలించారు. అధిక వర్షాలు, వరద ముంపు ప్రాంతాలలో దెబ్బతిన్న ఉద్యాన పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు తెలపారు. వివిధ పంటల నష్టాన్ని పరిశీలించి, రైతు వారీగా జాబితాలు తయారుచేసేందుకు సమాయత్తం కావాలని ఉద్యాన సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలో 5,228 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీకుమార్, నీలిమ, కిరణ్మయి, నరేంద్ర నాయక్ పాల్గొన్నారు.

300 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కంచికచర్ల: విశాఖ జిల్లా నర్సీపట్నం నుండి ముంబైకి కారులో గంజాయి రవాణా చస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి 300 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు నందిగామ ఏసీపి రవికిరణ్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 3వ తేదీ మధ్యాహ్నం ఎస్ఐ రాజు సిబ్బందితో కలిసి కంచికచర్ల సమీపంలో అక్షయ హోటల్ వద్ద జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారన్నారు. ఈ తనిఖీల్లో కారులో గంజాయిని తరలిస్తున్న మహారాష్ట్ర పూణే జిల్లా సోంగాన్ గ్రామానికి చెందిన శుభం దత్తాత్రే భన్దవాల్కర్ (26)ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నర్సీపట్నంలో కిలో గంజాయి రూ.3 వేలకు కొనుగోలు చేసి ముంబైలో రూ.10 వేలకు అమ్ముకునేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.30 లక్షలు ఉంటుందని ఏసిపి తెలిపారు. నిందితుడిని బుధవారం నందిగామ కోర్డులో హాజరుపరిచినట్లు తెలిపారు.

మట్టి ఖర్చులకు సాయం

ప్రజాశక్తి-మైలవరం: చనిపోయిన కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం మైలవరం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. మైలవరంకు చెందిన బండారు నవీన్ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న లితీష్ కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, వెంకట్రావు, జల్లి కృష్ణ, అంకరాజు, జానీ, కరీం తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటనలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను, ఆస్తి నష్టాన్ని తక్షణమే అంచనా వేసి నష్టపరిహారాన్ని రైతులు, కౌలు రైతులు, వరద బాధితులను ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం మండల నాయకులు షేక్ గౌస్ మియా, కోటా రవికుమార్,



దంతాల నరేంద్ర కోరారు. మండలంలోని బలుసుపాడు, అన్నవరం, రెడ్యా నాయక్ తండా, బుధవాడ గ్రామాల్లో సిపిఎం బృందం బుధవారం పర్యటించింది. వరదల వల్ల నష్టపోయిన పంటలను, వరదల్లో కొట్టుకుపోయిన రోడ్లను, బ్రిడ్జిలను పరిశీలించారు. అనంతరం వరదల వల్ల నష్టపోయిన బాధితులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రెడ్యా నాయక్ తండా గ్రామానికి వచ్చిన తాసిల్దార్ నాగరాజు, ఎండిఒ రమేష్‌బాబును వరదల పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వరదల వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు నష్టపరిహారం అందజేయాలని కోరుతూ తాహసిల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోటా కృష్ణ, జె.వెంకటరావు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ



పట్టణంలోని బస్టాండు పక్కన హరిజనవాలో వరదలో మునిగిన ఇళ్లను సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం నందిగామ కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ పిల్లల సర్టిఫికెట్లు కూడా వరదకు కొట్టుకుపోయాయన్నారు. బాధితులకు ఒక్కపూట మాత్రమే భోజనం ఏర్పాటు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నందిగామ కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, కర్రి వెంకటేశ్వరావు, గోపినాయక్, జంగా దామోదర్ పాల్గొన్నారు.

అర్థమయ్యేలా బోధన : సాంబశివరావు



ప్రజాశక్తి-నందిగామ: ఉపాధ్యాయులు జీవనది లాంటి వారని, సమాజాన్ని అభివద్ధి పదంలో నడిపిస్తున్నారని పల్లగిరి మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.సాంబశివరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధించి వారి గుండెల్లో చెరగని ముద్ర పడుతుందని తెలిపారు.

క్రమశిక్షణతో విద్య : వెంకటరమణ



ఉపాధ్యాయ వృత్తి చేపట్టడం అంత సులవుకాదని, ఎంతో త్యాగం అవసరమని రుద్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.వెంకటరమణ పేర్కొన్నారు.ఉపాధ్యాయ వృత్తి అంకితభావంతో పని చేయాలని, వ్యాపారం చేయకూడదన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో విద్య బోధించటం ఉపాధ్యాయులపై ఉందన్నారు.

చదువుతో పాటు ఆటలు : నాగలక్ష్మి



విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య బోధించాలని లింగాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.నాగలక్ష్మి పేర్కొన్నారు. తమ పాఠశాలలో చదువుతో పాటు ఆట పాటలు, డిజిటల్ టివి ద్వారా సృజనాత్మక విద్య బోదిస్తున్నామని తెలిపారు.

కార్పొరేట్‌గా ధీటుగా బోధన : బిక్షాలు



విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య బోధిస్తున్నట్లు గోళ్లమూడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరేపల్లి బిక్షాలు పేర్కొన్నారు. తమ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధిస్తున్నామని తెలిపారు.

ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాం : వెంకటరమణ



రాఘవాపురం మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నామని, మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తున్నామని రాఘవాపురం మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్.వెంకటరమణ పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్నం బోజనం రుచికరంగా ఉంటుందని వివరించారు.

ఒత్తిడి లేని విద్యకు శ్రీకారం : నారాయణరావు



విద్యార్థులకు సృజనాత్మక విద్య బోధిస్తున్నామని అడవిరావులపాడు మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పిఆర్‌టియు నాయకులు గడ్డం నారాయణరావు పేర్కొన్నారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో తమ పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి లేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నాం : నవాబ్ జాని



నవ సమాజ నిర్మాణంలో భాగంగా విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని గోళ్లమూడి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు షేక్ నవాబ్ జాని పేర్కొన్నారు. సమాజంలో మూఢనమ్మకాలు, రుగ్మతలు పారద్రోలటానికి చదువు ఎంతో అవసరమని తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

చిలుకూరులో పెరిగిన నీటిమట్టం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలం చిలుకూరు వద్ద ఏనుగు గడ్డ వాగుపై గంటగంటకూ మరలా నీటిమట్టం పెరుగుతోంది. దీంతో చిలుకూరు, దాములూరు, కొత్తపేట గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.



తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మున్నేరు, కట్టలేరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వీటి ప్రభావంతో ఏనుగు గడ్డ వాగు ఉగ్రరూపంతో ఉరకలు వేస్తోంది.

బాధితులను ఆదుకోవాలి : సిపిఎం



ప్రజాశక్తి-విజయవాడ: తూర్పు నియోజకవర్గం పరిధిలోని రాణిగారితోట తారకరామానగర్, భుపేష్‌గుప్తానగర్, రామలింగేశ్వర్‌నగర్, గీతానగర్, కళానగర్, గాంధీకాలనీ తదితర ప్రాంతాల్లో వరద నీటిలో వందల సంఖ్యలో ఇళ్లు చిక్కుకొని గత ఐదు రోజుల నుంచి దెబ్బతింటున్నాయని, వెంటనే మోటార్ల ద్వారా నీటిని బయటకు పంపించే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావును సిపిఎం నేతలు కోరారు. ఆపార్టీ తూర్పు సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు పి కృష్ణ, బి చిన్నారావు, ఇతర పలువురు నాయకులు, కార్యకర్తలు వరద నీటిలో దెబ్బతింటున్న ఇళ్లను పరిశీలించి, బాధిత ప్రజలను పరామర్శించారు. బాధిత ప్రజల ఇబ్బందులు, దెబ్బతింటున్న ఇళ్ల పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు దృష్టికి సిపిఎం నేతలు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణ, చిన్నారావు మాట్లాడుతూ... కష్ణా నది వరద తగ్గినా..నేటికీ పీకల్లోతు నీళ్ళలోనే రామలింగేశ్వర నగర్ లోని గాంధీ కాలనీ, కళా నగర్, గీతా నగర్, భూపేష్ గుప్తా నగర్, తారక రామానగర్ ప్రజలు ఉన్నారని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రైనేజీ వాల్స్ మూసి ఉండడం, రెటైనింగ్ వాల్ అడ్డు గోడ వలన వరద నీరు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. హెవీ మోటార్ల ద్వారా నీటిని తరలిస్తే తప్ప కదిలే పరిస్థితి లేదన్నారు. జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, విఎంసి స్కూల్, కష్ణలంక హైస్కూల్ లలోనే వరద బాధితులున్నారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో తీవ్ర నష్టం, ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఉంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జి.కె.ప్రసాద్, కాయల లక్ష్మణ, తాండవ కృష్ణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు ముమ్మరం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3454 మంది పారిశుధ్య కార్మికులతో పాటు 450 మంది ప్రజారోగ్య విభాగం సిబ్బంది, రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల నుంచి 5889 మంది పారిశుధ్య కార్మికులను విజయవాడకు రప్పించిన ప్రభుత్వం సింగ్‌నగర్ వరద నీరు లేని ప్రాంతాల్లో పారిశుధ్య పనిని చేయిస్తున్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలవరకూ రోడ్లపై చెత్తను తొలగించేందుకు విధుల్లో పాల్గొన్న 4498 మంది కార్మికులను విధుల్లో ఉంచి శానిటేషన్ పనిని చేయించారు. 48 ఫైర్ ఇంజన్ ల ద్వారా వీధుల్లో, ఇళ్లలోకి చేరిన మురుగును సిబ్బందితో తొలగిస్తున్నారు. వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు తీసుకొచ్చేలా ప్రభుత్వం సహాయక చర్యలు నిర్వహిస్తుంది. నగరంలోని మొత్తం 149 సచివాలయాల పరిధిలో ఉన్న 32 వార్డుల్లో వరద ప్రభావ ప్రాంతాలను కీన్ చేసే పనిలో అధికారులున్నారు.

ఉచిత బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-విజయవాడ: ఇప్పుడిప్పుడే వరద ప్రవాహం తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతమైన అజిత్ సింగ్ నగర్ నుంచి ఉచిత బస్సు సర్వీసులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అజిత్‌సింగ్ నగర్ నుంచి విజయవాడలోని పలు ప్రాంతాలకు చేరుకునేలా ఆరు బస్సులను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ఏపీఎస్ఆర్టీసీ అధికారుల పర్యవేక్షణలో సజావుగా బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఆహారం సరఫరా,వైద్య సేవలు, మంచినీటి సరఫరా, మందులు అందించడం.. తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు ముఖ్యమంత్రి మార్గదర్శకాలకు అనుగుణంగా బాధితుల సంక్షేమానికి సంబంధించి ప్రతి చిన్నవిషయాన్ని అర్థం చేసుకుంటూ, అవసరాలను తెలుసుకుంటూ యుద్ధప్రాతిపదికన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ముంపు ప్రభావం వల్ల ఎవరూ ఎలాంటి ఇబ్బందులు పడకూడదనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే తాజాగా ప్రభుత్వం ఉచిత బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది.